==================================================================

A Commemorational Article on Swara Brahma K.V. Mahadevan

(On the occasion of his 6th vardhanthi - 06/22/2007)

-- Hemalatha Venkatesan

==================================================================

"గుక్క తిప్పుకోనీకుండా బుర్ర మీద డప్పుల హోరు
దాన్ని డామినేట్ చెయ్యాలని చించుకుంటూ సింగర్ నోరు
అది ఎంతో శ్రావ్యంగా ఉన్నట్టుగా తలలూపేస్తూ శ్రోతల జోరు..
ఇదీ... ఈనాటి పాట తీరు!!"

నెత్తి మీద సుత్తి తో మోదినట్టు ఏకబిగిన ధనాధన్ లే కానీ, భావానికి అనువైన రాగం వినే ఆశే లేదు ఈ ఇంటర్ నెట్ యుగంలో. గాయకుడి గొంతే మూలుగులా ఎక్కడో లీలగా వినిపిస్తుంటే ఇక ఆ పాటలోని సాహిత్యం అర్ధం చేసుకోవాలంటే చెవులకి భూతద్దం పెట్టుకోవాలేమో!

అర్ధవంతమైన మాటల మల్లెలను ఓ రాగపు దారానికి గుచ్చి మెడలో వేస్తే ఆ సువాసన కి - వేడెక్కిన మెదడు చల్లబడుతుంది, బరువెక్కిన మనసు తేలిక పడుతుంది, కాసేపైనా శరీరం relaxation కి లోనవుతుంది. మన అదృష్టం బావుంటే కొన్ని పాటల్లో వీటితో పాటు ఆలోచింపచేసే చక్కని భావం కూడా ఉంటుంది - మల్లెల మధ్య దాగిన మరువపు దళాల పరిమళం కూడా సోకినట్టు..

మంచి పాట విన్న ఆనందం రోజంతా చేసే పనుల్లో సాఫల్య ధోరణి స్ఫురింపజేస్తుంది.. మ్యూజిక్ థెరపీకి ఉన్న శక్తి ఎక్కువ శాతం బాహ్యంగా కనపడకపోయినా అంతర్లీనంగా నవనాడులను చైతన్యవంతంగా ఉంచుతుంది.. ప్రశాంతతని మెదడుకి, ఉత్సాహాన్ని మనసుకీ కలిగిస్తుంది.

ఆయనగారెవరో (ఒక మ్యూజిక్ డైరెక్టర్) ఒకలాంటి బీట్ కొట్టి పేరు తెచ్చుకున్నాడు కాబట్టి, పోటీగా ఇంకోకాయన గారు అలాంటి పది బీట్లతో చావబాది తన ఆధిక్యతని చాటుకునే ప్రయత్నంలో.. అటూ, ఇటు మద్దెల దరువుకి దొరికే గొర్రెలు శ్రోతలు!! వీణ, మురళి, సన్నాయి లాంటి మృదువైన వాయిద్యాలు వాడడం ఇప్పుడు నామోషి. అదేదో సినిమాలో అన్నట్టు దేవుడు కళ్ళకి రెప్పలు ఇచ్చినట్టు చెవులకు కూడా మూతలు ఇచ్చి ఉంటే?! అనుక్షణం రొదతో అట్టుడిగిపోయే ఈ ఆధునిక ప్రపంచంలో నా వీనులైతే అత్యధిక కాలం శయనోత్సవం చేస్తూ, కె.వి. మహాదేవన్ లాంటి పుంగవుల శ్రావ్యమైన సంగీతానికి మాత్రమే తెరుచుకునేవి.

జన్మతః మళయాళీ అయినా, స-రి-గ-మ-ప-ద-ని మాత్రమే అక్షరాభ్యాసం చేసిన మహాదేవన్ గారిని భాషా భేదం కట్టడి చెయ్యలేకపోయింది. దాదాపు 40 వసంతాలపాటు స్వరగురువుగా 600 తెలుగు, 250 తమిళం, మళయాళం, కన్నడం పాటలు ట్యూన్ చేసి దక్షిణ భారత సినీచరిత్రలో సుస్థిర స్థానం సంపాదించిన మహాదేవన్ గారి ప్రభావం ఇంకా కొద్ది మంది మ్యూజిక్ డైరెక్టర్ల మీద ఉందంటే అతిశయోక్తి కాదు. ఆయన బాణీలోనే చెప్పిన రాధాకల్యాణం సినిమాలోని పాటలాగ, cinema field కి వచ్చిన ప్రతి సంగీత దర్శకుడూ ఇదే పాడుకుంటాడేమో!

పాలఘాట్ మాధవన్ పాటంటే ఝుణాఝుణ్..
ఛాన్స్ దొరికితే కానా మా.. మా.. " మామా " మహాదేవన్!

సబ్బుబిళ్ళ, కుక్కపిల్ల, అగ్గిపుల్ల- కాదేదీ కవితకి అనర్హం అన్నట్టు కె.వి. మహాదేవన్ గారి motto - కాదేదీ రాగానికి అనర్హం అని అయ్యుంటుంది. న్యూస్ పేపర్ ఎడిటోరియల్ కి కూడా ట్యూన్ కట్టగల సత్తా ఉన్నవారని ఆయనకి ప్రఖ్యాతి. సంగీతాన్ని ఉశ్వాస నిశ్వాసాలుగా చేసుకున్న వాళ్ళకే అది సాధ్యం.

తెలుగువాళ్ళుగా పుట్టినందుకు గర్వించే ఎంతో మందికి చిరస్మరణీయంగా మిగిలిపోయే మధురమైన తెలుగు బాణీలని ఎన్నో అందించారు. ఏ చెట్లు లేని చోట ఆముదం చెట్టు గొప్ప ఏమీలేదు. పదునైన పోటీ లేనిదే నిజమైన ప్రతిభకి విలువ లేదు, దాని పస్నె వెలికి రాదు. 60's లో యస్.రాజేశ్వర రావు, పెండ్యాల లాంటి మహానుభావులతోనూ, 70's లో సత్యం, చక్రవర్తి, రమేష్ నాయుడు లాంటి అద్భుత స్వర కర్తలతోనూ, 80's లో ఇళయరాజా లాంటి ప్రముఖ, అగ్ర విద్వాంసులతోనూ పోటీ తట్టుకుని ఓటమి లేకుండా నాలుగు దశాబ్దాల పాటు స్వరహేల సాగించిన ఘనత, ప్రతిభ కె.వి. మహాదేవన్ గారొక్కరిదే.

గాయకుడి గళం లోని నిబద్ధత, గద్యం లోని భావార్థ స్పష్టత చెరగకుండా వెనకుండి వెన్ను తట్టే పాత్ర మాత్రమే రాగానిది తప్ప వాటి మీదెక్కి స్వారీ చేసేది కాదు. పాటలోని సాహిత్యం తేటగా వినిపించేలా మహాదేవన్ గారు శృతి చేసిన అన్ని పాటల్లోనూ ఇది కనిపిస్తుంది –

నేల మీది జాబిలి..నింగి లోని సిరిమల్లి..
నా చెలి..నెచ్చెలి..చేరుకోరావా నా కౌగిలి..

పున్నమి లాగా వచ్చి పొమ్మని జాబిల్లడిగింది
పుష్కరమల్లే వచ్చి పొమ్మని గోదారడిగింది....

పాత్రలు పరస్పరం సంభాషించుకుంటుంటే దూరంగా ఎవరో అనువైన దరువు వేస్తున్నట్టుగా సాగే ఇలాంటి compositions మనః మననీయం, పునః స్మరణీయం:

మల్లె కన్న తెల్లన.. మా బావ మనసు
తేనె కన్న తీయన.. మా సీత సొగసు . .

తూరుపు సింధూరపు మందారపు వన్నెలలో
(నిజంగానే) ఉదయ రాగం.. హృదయ తాళం..

తన మనసులో స్వరసాగర మథనం చేసి, సంగీత దాహార్తులందరికీ కర్ణామృతాన్ని పంచిన మహాదేవన్ గారి ఖాతాలో ఇలాంటి జతులు కోకొల్లలు –

కొమ్మ కొమ్మకో సన్నాయి.. కోటి రాగాలు ఉన్నాయి..

ఎలా ఎలా దాచావు అలవికాని అనురాగం..

నిన్నే నిన్నే తలచుకుని.. నిద్దుర పొద్దులు మేలుకుని..

ఎవరో వచ్చి బాధాతప్త హృదయానికి సంగీత మంత్రం బోధించి, లాలి పాడి, హాయిని వరం గా ఇచ్చి నిద్రపుచ్చినట్లు వుండే స్వాంతనా సరిగమల సృష్టి ఆయనకే చెల్లు. ఆహ్లాదం మృదువైన బాణీల లోనే ఉందని కాదు. స-క్రమ బద్ధమైన బీట్స్ లోనూ అందం ఉంది.

మామ..మామా...మామా.. ఏమె ఏమే భామా..

కె.వి మహాదేవన్ గారి తొలి రోజుల ఈ ప్రయత్నం బీట్ ఉన్నదే. కాని అందులోనూ క్లాసిక్ టచ్ ఉంది, సున్నితమైన దరువుంది. గాయకుల

అరుపులు కూడా లయబద్ధమైన చట్రంలో ఉండడం వల్ల వినడానికి కమ్మగానే వుంది.

ఇలాంటి sizzlers ఎన్నెన్నో -

ఇరుసు లేని బండి.. ఈశ్వరుని బండి..

ఏడు కొండల వాడా వెంకటేశా.. అయ్యో ఎంత పని చేశావు తిరుమలేశా..

చిటపట చినుకులు పడుతూ ఉంటే.. చెలికాడే సరసన ఉంటే... (the evergreen classic)

చెంగావి రంగు చీర కట్టుకున్న చిన్నది..

ఆరేసుకోబోయి పారేసుకున్నాను హరి...

" చిటపట చినుకుల మేళం.. తడి పొడి తపనల తాళం " పాట మొదలయ్యే తీరే చిరుజల్లు ఒంటి మీద పడుతున్నట్టే ఉంటుంది.

ఏకలవ్యుడి పట్టుదల చూసి, ఆ సాధనకి తను ఉపకారయోగ్యం అయితే ధన్యం అనుకుని వెదురుగడ తనకు తానుగా విల్లు అయ్యి వొంగిందట! అలాగే విద్వత్తు ఉన్న కె.వి. మహాదేవన్ లాంటి మహానుభావుల యశస్సులో భాగం అయితే చాలనే ఉబలాటంతో గాలి కూడా ఆయన composition లోని క్రమశిక్షణకి తల ఒగ్గి ఉందేమో, విందేమో!

ఝుమ్మంది నాదం.. సయ్యంది పాదం.. కూర్చిన రాగం కాక మరేది ఈ పదాలకి ఇంత న్యాయం చెయ్యలేదేమో అనిపించే సొంపు ప్రతి పాటకీ సొంతం-

ఓంకార నాదాను సంధానమౌ గానమే శంకరాభరణము..

రాగం, తానం, పల్లవి.. నా మదిలోనె కదలాడి కడతేరమన్నది..

సరస స్వర సుర ఝరీ గమనమౌ సామ వేద సారమిది..

విశ్వనాథ్, సీతారామ శాస్త్రి లాంటి ఉత్తమ సాహిత్యాభిరుచి ఉన్న పెద్దల శ్రమ సృష్టికి పరిపూర్ణ న్యాయం చేసిన మామ స్వర పుత్రికలెన్నో - సిరివెన్నెల, శంకరాభరణం, సప్తపది, శుభలేఖ, శుభోదయం, సిరిసిరి మువ్వ, సీతామాలక్ష్మి, స్వాతికిరణం..

లిరిక్ తీసుకొని ట్యూన్ చెయ్యడం అంటే - అదీ పరభాషా కోవిదుడు ఆషామాషీ కాదు - పదం విరక్కూడదు, భావం చావకూడదు. ప్రాసలు ప్రస్ఫుటం అయ్యేలా వాక్యం విరగాలి.. అనువుకాని అక్షరం దగ్గర ఆలాపన చెడకూడదు.. పాట ఆర్ద్రత తగ్గకూడదు, లయ మారకూడదు.. ఈ పాటల్లో లాగ -

కురిసే వెన్నెల్లో.. మెరిసే గోదారిలా..

మామ కూతురా.. నీతో మాటున్నది..

సీతాలు సింగారం.. మాలచ్చి బంగారం

మావిచిగురు తినగానే.. కోయిల పలికేనా..

ఈ క్రింది పాటలో చరణాల మధ్య రాగం మారుస్తూ కూడా చివరలో పల్లవికున్న రాగం తోనే ముక్తాయించడం సామాన్యం కాదు. రాగం మూడ్ మార్చాలి కానీ.. ఆ భావం లో ఉన్న సందర్భం ఏమార్చకుండా మళ్ళీ పల్లవి టెంపో కి వెళ్ళి ముగించాలి.

పడకు పడకు.. అడ్డు పడకు.. పడుచు వాని చేయి విడకు . .

మహాదేవన్ గారి స్వరార్చనలో ఒదిగిన ఇలాంటి పువ్వులన్నింటినీ లెక్క పెట్టుకుంటూ పోతే తనివి తీరదు, సమయమూ చాలదు..

ఎటువంటి పాటకి ఎన్ని పాళ్ళ తాళ, లయ, జతుల మిశ్రమం సరైనదో ఔపోసన పట్టిన ఈ స్వరబ్రహ్మ, అనాచ్ఛిదంగా నిలిచిన అక్షర సమూహం పై కప్పిన పునీత రాగోపవీతం.... సంగీతం!

ఆ మహానుభావుడి వర్ధంతి సందర్భంగా చేసుకుంటున్న ఈ సంస్మరణలో మామకి కుడిభుజమైన పుహళేంది గారిని విస్మరించడం సబబు కాదేమో! తాద్యాత్మ్యతను మిగిల్చే ఎన్నో మధురిమలను మనకు కానుకగా ఇచ్చినందుకు ప్రతిగా, ఈ స్వరోపాసనా దురంధరులిరువురికీ కృతజ్ఞతాంజలులతో చిరు నివాళి..

-- హేమలతావెంకటేశన్
జూన్ 22, 2007